ప్రజాశక్తి

శుక్రవారం 28 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రయాణమంటే భయమేస్తోంది

◆ వడ్డాది నుంచి ఘాట్ రోడ్డు వరకూ రహదారిని బాగుచేయరా ? ◆ నేమ్‌బోర్డు దాచుకొని వెళ్లాల్సిన దుస్థితి ◆ స్థాయీ సంఘ సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర ◆ ప్రోటోకాల్ పాటించకపోతే సిఎంకు ఫిర్యాదు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖపట్నం

'వడ్డాది నుంచి ఘాట్ రోడ్ వరకూ రోడ్డు బాగోలేదు. ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నప్పుడు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నేమ్‌బోర్డు కారులో దాచి వెళ్లాల్సివస్తోంది. ఇంత ఘోరంగా రోడ్లు వుంటే ఎలా ? ఎంతోమందికి ఉపయోగపడే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయకపోతే ప్రజలెన్ని ఇబ్బందులు పడతారో ఆలోచించారా ?' అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఒకటి నుంచి ఏడు జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాల్లో ఆమె మాట్లాడారు. వర్షాలు పడితే ప్రయాణాలు చేయలేని పరిస్థితిలో రోడ్లు వున్నాయన్నారు. భీమిలి మండలంలో కెజిబివి ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించని విషయాన్ని జెడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు తెలపగా దీనిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ జెడ్‌పిటిసి, ఎంపిపిలను ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవని శాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మరోసారి తమను ఆహ్వానించలేదన్న మాట సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తే కలెక్టర్, ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద సరుగుడు మొక్కలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్‌కు ఆమె సూచించారు. సొంత పొలాల్లో ఇంటి అవసరాల కోసం చెట్లును కొట్టుకునే రైతును ఇబ్బంది పెట్టవద్దని అటవీ శాఖాధికారులను కోరారు. పాడేరు డివిజన్‌లో పాఠశాల భవనాల్లేవని ఆమె ప్రస్తావించగా 940 పాఠశాల భవనాలు మంజూరైనట్లు విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. భీమిలి జెడ్‌పిటిసి వెంకటప్పడు మాట్లాడుతూ నాడు - నేడు కింద ఎంత ఖర్చుపెట్టినా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేక పిల్లలు చేరడం లేదన్నారు. కృష్ణంరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 110 నుంచి 50 మందికి విద్యార్థులు తగ్గారని తెలిపారు. సీజనల్ వ్యాధులు, కళ్ల కలకల వ్యాప్తి ఎక్కువుగా ఉండడంతో హాస్టల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఛైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. విద్యార్థులు ప్రయివేటు కాలేజీలకు వెళ్లకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోటవురట్ల, చీడికాడ జెడ్‌పిటిసి సభ్యులు సిద్ధాబత్తుల ఉమాదేవి, లాలం శారద వరలక్ష్మి అన్నారు. నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ మాట్లాడుతూ మిగతా 2లో..

సిఎం పర్యటనకు విశాఖ ముస్తాబు

1న ఇనార్బిట్ మాల్‌కు జగన్ పునాదిరాయి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ నెల 1న విశాఖకు రానున్నారు. ప్రపంచంలో పేరుమోసిన రియల్ ఎస్టేట్ డవలపర్ నీల్ కె రహేజా కార్పొరేషన్ ఆధ్వర్యాన విశాఖ పోర్టుకు సంబంధించిన 1700 ఎకరాల స్థలంలో భారీ షాపింగ్ మాల్ ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మూడేళ్లలోపు ఈ 'ఇనార్బిట్' షాపింగ్ మాల్‌ను విశాఖ నగరంలోని శాలిగ్రాం పురంలో పూర్తిచేసేందుకు ఒప్పందాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు విచ్చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఆరు లక్షల చదరపు అడుగుల స్థలాన్ని విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి) రహేజా సంస్థకు అప్పగించి చదును చేయించే పని కూడా పూర్తిచేసింది. సిఎం వైఎస్ జగన్ వచ్చి మాల్‌కు శంకుస్థాపన చేయనున్నారు.

భారీ ప్రాజెక్టులివేనా ?

రాష్ట్ర ప్రభుత్వం విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటన చేసిన తర్వాత రెండు ప్రధాన ప్రాజెక్టుల్లో అదానీ డేటా సెంటర్ రూ.14500 కోట్లతో విశాఖలోని 130 ఎకరాల్లో ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతుండగా, తాజాగా రహేజా ఇనార్బిట్ షాపింగ్ మాల్ రాబోతుంది. రూ.600 కోట్ల పెట్టుబడితో ఎపిలోనే అతిపెద్ద షాపింగ్ మాల్‌గా ఇది నిలవనుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, విశాఖకు ఐటి సంస్థలు వస్తేనే ఉపాధి లభిస్తుందని, వస్తూత్పత్తి రంగంలో పరిశ్రమలు ఏర్పాటైతేనే మేలు జరుగు తుందన్న నిరుద్యోగుల ఆశలు మాత్రం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో చంద్రబాబు హయాంలో విశాఖ బీచ్‌లో లూలూ షాపింగ్ మాల్ వస్తుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. వైసిపి అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దు చేసేసి మరో రియల్ ఎస్టేట్ దిగ్గజంతో షాపింగ్ మాల్‌ను వేరేచోట ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయించారు. అంటే.. 'ఒకరి చేతి నుంచి మరొకరి చేతికి' భూములు బదలాయింపే తప్ప దీంట్లో విశాఖపట్నానికి ఒరిగిందేమీ లేదు. రహేజా సంస్థ, వైజాగ్ పోర్టు మధ్య జరిగిన ఒప్పందాల్లో భాగంగా పోర్టు గెస్ట్‌హౌస్ స్థలాన్ని 30 ఏళ్ల పాటు లీజుకు రహేజా తీసుకుంది. రూ.125 కోట్లను అందుకుగాను పోర్టుకు ఈ సంస్థ చెల్లించింది. కనీసం రూ.400 కోట్లయినా పోర్టుకు లీజు ఆదాయం రావాల్సి ఉండగా ఇది ఏకపక్షంగా గత పోర్టు యాజమాన్యం చేసిందన్న విమర్శలూ లేకపోలేదు. తాజాగా మిగతా 2లో..

బిజెపి ద్రోహంపై మాట్లాడరేం : సిపిఎం

▶ వార్త మెయిన్‌లో..

డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

▶ వార్త 2లో..

'మణిపూర్' అకృత్యాలపై నిరసనలు

▶ వార్త 5లో..



విశాఖ పోర్టు ట్రస్టు అధికారులకు పురస్కారాన్ని అందజేస్తున్న అతుల్‌భట్

విశాఖ పోర్టుకు రాజ్య భాష పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2022 - 23 సంవత్సరానికిగాను రాజ్య భాష గౌరవ నమ్మాన్ పురస్కారం విశాఖపట్నం పోర్టు అథారిటీని వరించింది. విశాఖ నగర అధికార భాష అమలు కమిటీ ఛైర్మన్, స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ ఈ పురస్కారాన్ని విపిఎ ప్రతినిధులకు అందజేశారు. రోజువారి వ్యవహారికంలో రాజ్యభాష అమలు తీరును పరిశీలించి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఈ అవార్డును సాధించటం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆనందం వ్యక్తం చేశారు. సిబ్బందిని మెచ్చుకున్నారు. అధికార భాష అమలు విభాగం, భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారిక భాష డిప్యూటీ డైరెక్టర్, రీజనల్ కార్యాలయానికి సంబంధించిన అధికారులు, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా పోరుయాత్రను జయప్రదం చేయండి

◆ స్త్రీలపై హింసను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం ◆ నేడు విశాఖలో ప్రారంభం ◆ ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : మహిళలపై హింసకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న మహిళా పోరు యాత్ర ఈ నెల 28 నుంచి ఆగస్టు 8 వరకూ కొనసాగుతుందని, దీన్ని జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. రాష్ట్ర యాత్ర విశాఖపట్నంలో శుక్రవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమవుతుందని వెల్లడించారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'చేయి చేయి కలుపుదాం - హింస లేని సమాజం నిర్మిద్దాం, మద్యం, మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించాలి, హింస నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలి' అని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాతా జరుగుతోందన్నారు. నేడు మహిళలపై హింస విపరీతంగా పెరుగుతోందని, అసమానతలు, అవమానాలు, అత్యాచారాలు కొత్త రూపాలలో నారీ లోకాన్ని ఆవేదనకు గురి చేస్తున్నాయని అన్నారు. కుటుంబాలలో, పని ప్రదేశాలలో, సమాజంలో ఆర్థిక, లైంగిక దోపిడీ తీవ్రమవుతోందన్నారు. ప్రభుత్వాలు పరిస్థితిని చక్కదిద్దడం లేదని, చట్టాలు అమలుకావడం లేదని వాపోయారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై వేధింపులు, అత్యాచారాలు, అక్రమ రవాణా, అక్రమ నిర్బంధం, ఎత్తుకెళ్లిపోవడం వంటివి పెరిగాయన్నారు. 28.6 శాతం మాత్రమే శిక్షలు పడుతున్నాయన్నారు. వర్మ కమిషన్ సిఫారసు ప్రకారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన నేరస్తులకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

ప్రయాణమంటే భయమేస్తోంది

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు సంతృప్తికరమైన సేవలందిస్తున్నప్పటికీ లిఫ్ట్, జనరేటర్ వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. మంచంపై ఇద్దరు గర్భిణులను సర్దుబాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచాల మోడల్ పాఠశాలలో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని జెడ్‌పిటిసి శారద వరలక్ష్మి కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ, జెడ్‌పిటిసిలు, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు విశాఖ ముస్తాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోర్టు స్థలంలో నిర్మించబోయే రహేజా షాపింగ్ మాల్ శంకుస్థాపనకు ఆగస్టు 1న రాబోతున్నారన్న సమాచారంతో జివిఎంసి, పోర్టు అధికారులు ఏర్పాట్లులో నిమగ్నమయ్యారు.

మహిళా పోరుయాత్రను జయప్రదం చేయండి

శిక్ష పడాలని గుర్తుచేశారు. నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వర్మ కమిషన్ మాదిరి మన రాష్ట్రంలో కూడా విశ్రాంత న్యాయమూర్తులు, మేధావులతో ఒక కమిషన్ వేయాలన్నారు. హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలన చిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థినులకు, యువతులకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. పోరుయాత్రలో భాగంగా చివరగా ఈ నెల 8న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పాల్గొన్నారు.

డాక్టర్ జాన్ మాడుగులకు గ్లోబల్ ఎక్స్‌లెన్సీ అవార్డు



డాక్టర్ జాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వీ డెంటల్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ మాడుగుల గ్లోబల్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. వింటేజ్ సంస్థ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఈ నెల 28న విటిటి ఫౌండేషన్ డాక్టర్ జాన్‌కు ఈ పురస్కారాన్ని అందించి సత్కరించనుంది. ఈ మేరకు విటిటి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ మణిభూషణ్ అవార్డు వివరాలు వెల్లడించారు. వైద్య, సాంస్కృతిక, సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నందుకుగాను డాక్టర్ జాన్ మాడుగులకు ఈ గుర్తింపు లభించింది. కాస్మొటిక్ డెంటల్ సర్జన్‌గా దేశ నలుమూలలా జాన్ సేవలు అందించారు. విశేష అనుభవం గడించి దంత వైద్యాన్ని సామాన్యుడికి అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఆయన తన బృందంతో కలసి కృషి చేస్తున్నారు. ఆయన భార్య డాక్టర్ అనిత మాడుగుల కూడా సీనియర్ డెంటల్ ఇంప్లాంటాలజిస్ట్‌గా సేవలు అందించడం విశేషం. ఉత్తరాంధ్రలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా వేలాది మందికి దంత సమస్యల పట్ల జాన్ అవగాహన కల్పించారు. శుక్రవారం విశాఖలో జరగనున్న కార్యక్రమంలో డాక్టర్ జాన్ మాడుగుల ఈ అవార్డు అందుకోనున్నారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - అడ్డతీగల : రాయపల్లి పంచాయితీ వెదుళ్ళ కొండ గ్రామానికి చెందిన మడకం కష్ణ, మల్లీశ్వరిలకు చెందిన తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమై, తీవ్ర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న అడ్డతీగలకు చెందిన సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఆరోగ్య రాజు సంస్థ ప్రతినిధులతో కలిసి ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించి 25 కేజీల బియ్యం, 12 రకాల కిరాణా సామాన్లు, 10 రకాల కూరగాయలు అందించారు.

డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అభివృద్ధి కార్యకలాపాలు, సౌకర్యాలు, స్టేషన్ పునరాభివృద్ధి కార్యకలాపాలను సమీక్షించారు. పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్న జ్ఞానాపురం వైపు ఉన్న స్టేషన్ గతిశక్తి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులను సూచించారు. మల్టీలెవెల్ స్టోరీడ్ కార్ పార్కింగ్ నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. వెయిటింగ్ హాల్స్, ఎసి రిలాక్సింగ్ లాంజ్, ఫుడ్ కోర్టుల్లో తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సాయిరాజ్ ఉన్నారు.



విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఎం

ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో విశాఖ కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో విశాఖ కీలకపాత్ర పోషించనుందని హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా తెలిపారు. హరి కృష్ణ గ్రూపునకు చెందిన కిస్నా డైమండ్, గోల్డ్ జ్యువెలరీ ఆధ్వర్యంలో నగరంలోని బీచ్ రోడ్డులోగల హోటల్ గ్రాండ్ బేలో గురువారం క్లస్టర్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరి కృష్ణ గ్రూపునకు చెందిన కిస్నా 2005 నుంచి ప్రసిద్ధ ఆభరణాల బ్రాండ్‌గా పేరుగాంచిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 3,500కు పైగా రిటైలర్‌లకు విస్తృతంగా పంపిణీ చేస్తూ అతిపెద్ద డైమండ్ జ్యువెలరీ బ్రాండ్‌గా నిలిచిందన్నారు. కిస్నా గోల్డ్, డైమండ్ జ్యువెలరీ డైరెక్టర్ పరాగ్ షా మాట్లాడుతూ సంస్థ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కిస్నా ఎపి రీజనల్ మేనేజర్ మహేష్ గందానీ, నికుంజ్ కోరట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జ్యువెలరీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.



ప్రతిమను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-మోతుగూడెం

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు స్థానిక మోతుగూడెం ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1998 విద్యుత్ సంస్కరణల చట్టం ప్రకారం త్రైపాక్షిక ఒప్పందాలను, గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ నుండి పిఆర్‌సి, డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాలని, తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అమలు చేయాలని కోరారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కార్యాలయం ముందు గురువారం విద్యుత్ ఉద్యోగులు నలబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వై.సత్తిబాబు మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వ నెరవేర్చే వరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు సత్యనారాయణ, దారాజు, బి.రమేష్, ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

9 మందికి విదేశీ విద్యా దీవెన

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో అనకాపల్లి జిల్లా నుండి 9 మంది విద్యార్థులకు రూ.85,90,171 అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జెసి మాట్లాడుతూ విదేశీ విద్యా దీవెనను అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ పథకానికి 8 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలు అర్హులని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు 1.25 కోట్ల వరకు, ఇతరులకు కోటి రూపాయల వరకు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి అజయ్ బాబు, ఎస్టీ సహాయ సంక్షేమ అధికారి నాగ శిరీష, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి



మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం: 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కొమ్మాది గాయత్రి విద్యా పరిషత్ మహిళా కళాశాలలో భీమిలి డివిజన్ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో 50 శాతం ఓటింగ్ జరిగిందని దీన్ని బట్టి ఎక్కువ శాతం యువత ఓటు హక్కును వినియోగించుకోలేదని స్పష్టమౌతోందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల పలు సందేహాలను ఆర్‌డిఒ నివృత్తి చేశారు.కార్యక్రమంలో రూరల్ మండలం తహశీల్దార్ ఎస్. రమణయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వే పరిశీలన

భీమునిపట్నం : జివిఎంసి మూడవ వార్డు, 182 నెంబరు పోలింగ్‌కేంద్రం పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా సర్వేను ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి, జెడ్‌సి బి రాము గురువారం పరిశీలించారు. ఓటరు జాబితా సర్వేలో ఇబ్బందులు ఏమైనా ఎదురవుతున్నాయా? ఇతరత్రా సందేహాలు ఉంటే అడగాలని బిఎల్‌ఒలు రత్న కుమారి, అల్లిపిల్లి నరసింగరావులకు ఆర్‌డిఒ సిబ్బందికి సూచించారు. నిర్దిష్ట కాలపరిమితి లోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం: అర్హులైన రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.రెండు వేలు పెట్టుబడి సాయాన్ని ప్రధాని జమచేశారని భీమిలి వ్యవసాయశాఖ ఎడి డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ తెలిపారు. గురువారం వేములవలసలో గణేష్ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా రాజస్థాన్ సికర్‌లో ప్రధాని మోడీ ప్రారంభోత్సవ వేడుకలను రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.మండల వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్యారత్నప్రభ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: బోయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ, మరమ్మతులు సందర్భంగా ఈ నెల 28న శుక్రవారం ఉదయం 8:30గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇ సురేష్ కుమార్ తెలిపారు. కొత్త కల్లివానిపాలెం, గంభీరం, బోయపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగిస్తున్న

నకిలీ నేవీ అధికారి అరెస్ట్

ప్రజాశక్తి -ములగాడ : నేవీ, అగ్నివీర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగిస్తున్న నకిలీ నేవీ అధికారిని మల్కాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి గురువారం సిఐ జిడి.బాబు ఆధ్వర్యంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను జోన్-2 డిసిపి ఆనంద్‌రెడ్డి, హార్బర్ ఎసిపి మోజెస్ పాల్ వెల్లడించారు.

ఈస్ట్ పాయింట్ కాలనీ సమ్మత అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 401లో నివాసముంటున్న గాడి సూర్య చలపతిరావు అలియాస్ శశికాంత్ గడచిన పదేళ్లుగా నేవీ కమాండర్‌నని నమ్మించి, ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించి రూ. లక్షల్లో సొమ్ములను వసూలు చేశాడు.

అదే క్రమంలో ఈనెల 26న ఐఎన్ఎస్‌హెచ్ కల్యాణి ఆస్పత్రి వద్ద జరిగిన అగ్నివీర్ పథకం కింద అభ్యర్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, అక్కడకు వెళ్లి నిరుద్యోగులను కలిసి, అగ్నివీర్ అభ్యర్థులకు మాయమాటలను చెప్పి వారి వద్ద నుంచి సొమ్ములను వసూలు చేసేందుకు ప్రయత్నించాడు. దీన్ని గమనించిన నేవల్ అధికారులు ఈనెల 26న కల్యాణి ఆస్పత్రి నుంచి



వివరాలు వెల్లడిస్తున్న డిసిపి ఆనందరెడ్డి, ఎసిపి పాల్

నేవల్ క్యాంటీన్ వద్దకు వెళ్లి అగ్నివీర్ అభ్యర్థులతో మాట్లాడుతున్న సమయంలో సూర్య చలపతిరావు అలియాస్ శశికాంత్‌ను పట్టుకుని, మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అందిన ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి నకిలీ నేవల్ అధికారి శశికాంత్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి కారు, పలు సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం సిఐ జిడి బాబు ఆధ్వర్యంలో పలు కోణాల్లో కేసు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్త బస్‌యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మధురవాడ :రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి' నినాదంతో వచ్చేనెల 16 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలలో బస్‌యాత్ర నిర్వహిస్తున్నామనిసిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎండి బేగం అధ్యక్షతన నిర్వహించిన మధురవాడ ఏరియా సమితి సమావేశంలో మాట్లాడుతూ, ఈ బస్‌యాత్ర ఆగస్టు 16న ఉదయం 10 గంటలకు విశాఖ కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద ప్రారంభమౌతుందని, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వినతిపత్రం ఇస్తే ఫుట్‌ఓవర్ పూర్తవుతుందా?

చంద్రంపాలెం ఉన్నతపాఠశాల విద్యార్థులు జాతీయ రహదారిని దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే నిర్మాణం కష్టం కాదని, నేషనల్ హైవే అధికారులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి వినతిపత్రం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేత పైడిరాజు

ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందాయని సిపిఐ నేతలు ప్రశ్నించారు. విన్నవించామంటూ ప్రజలను మభ్యపెట్టే కాలయాపన తప్ప, తక్షణమే దీనివలన కలిగే ప్రయోజనమేంటో ముత్తంశెట్టి చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వి సత్య నారాయణ, జి వేంకగిరిరావు, కె కుమార్, బి కేశవయ్య, జి.మోహనరావు, కె నారాయణరావు పాల్గొన్నారు

దేవాలయ భూమి కౌలుకు బహిరంగ వేలం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి నగరపాలెం పంచాయితీ పరిధిలో లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం (శివ కేశవ ఆలయం)నకు చెందిన సర్వే నంబర్ 51/1లోని 1.26 ఎకరాల భూమిని బహిరంగ వేలం ద్వారా కౌలుకు అప్పగించారు.

2023 ఆగస్టు ఒకటి నుంచి 2026 జూలై 31 వరకు మూడేళ్లకు ఏడాదికి రూ.26 వేలు చొప్పున చెల్లించేలా బహిరంగవేలంలో హెచ్చుపాట పాడిన పూసర్ల రామారావుకు అనే వ్యక్తికి దేవాలయ భూములను సాగుకు అప్పగించేందుకు అధికారులు అంగీకరించారు.వేలం పాటకు పర్యవేక్షణాధికారిగా పిఎస్ఎన్ మూర్తి వ్యవహరించారు. ఆలయ ఇఒ బి మురళీమోహన్, ఇన్‌స్పెక్టర్ బి వసంతకుమార్ ఇతర అధికారులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల : ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన రాజుపేట శివారు రామన్నపాలెం వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణరావు ఇచ్చిన వివరాల ప్రకారం.. తంగేడు గ్రామానికి చెందిన అంకంరెడ్డి నూకరాజు (45) గ్రామ శివారులో వ్యవసాయ పొలం వద్ద సాయంత్రం సమయంలో కాళ్లు చేతులు శుభ్రం చేసుకున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో పడి మునిగిపోయాడు. గమనించిన మృతుడి అన్నయ్య బయటకు తీసి కోటవురట్ల సిహెచ్‌సికి తరలించారు. అప్పటికే నూకరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కైలాసపురంలో యువకుని హత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : కైలాసపురం ప్రాంతం తాటిచెట్లపాలెం హైవే బస్‌స్టాప్ దరి వైజాగ్ రెస్టారెంట్ అండ్ బార్‌లో గురువారం సాయంత్రం ఏడు గంటలకు యువకుని దారుణ హత్యకు గురయ్యాడు. బార్‌లో మద్యం తాగుతుండగా, కొంతమంది వ్యక్తులు దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. స్థానికుల నుంచి సేకరించిన వివరాలివి. కైలాసపురం ప్రాంతానికి చెందిన గణేష్ అనే వ్యక్తి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు ఇతని కుమారుడు భట్లసింగ్ కిరణ్ (19) గురువారం సాయంత్రం హత్యకు గురయ్యాడు. ముఖం నిండా గాయాలతో పడిఉన్న కిరణ్‌ను చూసి అక్కడివారు 108 వాహనానికి కాల్ చేశారు. 108 సిబ్బంది తనిఖీ చేయగా, అప్పటికే మరణించాడు. హత్య ఎలా జరిగింది? ఎవరు దాడి చేశారనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : నిబంధనలకు విరుద్ధంగా పాన్, కబాబ్ షాప్‌ల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని స్థానిక సిఐ డి రమేష్ హెచ్చరించారు గురువారం విధుల్లో భాగంగా స్థానిక బీచ్ రోడ్డు తిమ్మాపురంలో పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణదారులను హెచ్చరించారు

మానసిక వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం గంగునాయుడు ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, పిహెచ్‌సి సిబ్బందికి మానసిక వ్యాధులపై మానసిక వ్యాధుల జిల్లా ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.తేజస్విని గురువారం అవగాహన కల్పించారు. చిన్నపిల్లలు, యువత, వృద్ధులు అన్నివర్గాల ప్రజల మానసిక రుగ్మతలు, వాటిని అధిగమించేందుకు తగు సూచనలు చేశారు. ఒత్తిడి, ఆందోళన అనే సమస్యలను అదుపులో ఉంచుకోగలిగితే, మానసిక రోగాలను అరికట్టవచ్చన్నారు. ఎవరైనా మానసిక రోగులు ఉంటే, మానసిక వ్యాధుల జిల్లా ఆసుపత్రుల కన్వీనర్ డాక్టర్ రమేష్ కిషోర్ ఆధ్వర్యంలో నెలలో ఒకరోజు తాము వస్తామని ఉచితంగా కౌన్సెలింగ్ నిర్వహించి, మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ పి సాంబమూర్తి, మానసిక సోషల్ వర్కర్ గేదెల సత్తిబాబు పాల్గొన్నారు

విరిగిన కొండచరియలు

ప్రభావిత కొండవాలు ప్రాంతాల్లో అధికారులు, నేతల సందర్శన



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- గోపాలపట్నం : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జివిఎంసి 92వ వార్డు ఇందిరానగర్ కొండపై కొలువైన మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో కొండచరియలు విరిగి పడ్డాయి. మట్టి, రాళ్లు ఆలయ ప్రాంగణంలోకి చొచ్చుకొని వచ్చాయి. దీంతో ప్రహరీ కూలిపోయింది. ఆలయ కమిటీ సభ్యులు అందించిన సమాచారం మేరకు స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు వెంటనే స్పందించి, ఆలయ ప్రాంగణాన్ని సందర్శించారు రక్షణ గోడ నిర్మాణానికి అధికారులతో సంప్రదించి సమస్య పరిష్కరిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బంగారు తులసీరామ్ , కండేపల్లి కనకకుమార్, నానేపల్లి జయశంకర్, సత్యారావు, నూకరాజు, రాము,టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టండి : కె.రాజు

సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు నీలకంఠనగర్, శివలింగాపురం, న్యూ శ్రీనివాసనగర్‌లోని కొండవాలు ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు గురువారం పర్యటించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కొండవాలు ప్రాంతాల్లో ఇళ్లు, ప్రహరీలు కూలి, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. జివిఎంసి అధికారులతో మాట్లాడి తక్షణమే సహాయకచర్యలు చేపట్టాలని కోరారు. వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు, వీధిలైట్లు, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, ఎఇ అర్చన, సాయి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు సప్పంగి శ్రీను, స్థానిక వార్డు నేతలు సత్యనారాయణ రెడ్డి, రుత్తల రాంబాబు, మాస్టర్, ప్రశాంత్, వాసు, మణి, ఉమా, జివిఎంసి అధికారులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే దీక్ష విరమించం

అధికారులకు స్పష్టం చేసిన అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు



దీక్ష శిబిరంలో కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -గాజువాక : రూ.36వేలకు వేతనం పెంపు, ఇతర డిమాండ్లపై స్పష్టత వచ్చేవరకు దీక్ష విరమించేది లేదని, విధులకు హాజరుకాబోమని అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మిక సంఘం నేతలు, కార్మికులు స్పష్టం చేశారు. తమ సమస్యలపై 24రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్న నిర్వాసిత కార్మికుల దీక్షా శిబిరాన్ని గురువారం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, తహశీల్దార్, కార్మికశాఖ అధికారులతో కూడిన బృందం సందర్శించింది. దీక్షల్లో పాల్గొన్న కార్మికులు, కార్మికసంఘం నేతలతో సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా ఈనెల 21న వైవి.సుబ్బారెడ్డి సమక్షంలో గంగవరంపోర్టు యాజమాన్య ప్రతినిధులు, కార్మికసంఘ నేతలతో జరిగిన చర్చలకు సంబంధించిన తీర్మానాల కాపీలోని అంశాలను కార్మికులకు వివరించి, వాటి పకడ్బందీ అమలుకు ప్రభుత్వతరపున తామున్నామని అధికారులు భరోసానిచ్చారు. సమావేశంలో చర్చల మేరకు తొలగించిన కార్మికులు, ఉద్యోగులను బేషరతుగా యాజమాన్యం విధుల్లోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారిపై తదుపరి విచారణ (ప్రొసీడింగ్స్) ఉంటాయన్నారు వన్ టైం ఎక్స్‌గ్రేషియా కింద సెప్టెంబర్ నెల జీతంతో కలిపి ఒక్కో కార్మికునికి రూ. పదివేలను యాజమాన్యం ఇస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని మెడికల్ పాలసీ ప్రకారం యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. 21న చర్చలు అనంతరం 22 నుంచి విధులకు హాజరైతే, సమ్మె రోజులకు జీతం చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించినప్పటికీ, గడువు దాటినందున 27వరకు యాజమాన్యం వేతన చెల్లిస్తుందో, లేదో తదుపరి సమావేశంలో వెల్లడిస్తామన్నారు. అదానీ పోర్టు యాజమాన్యం నిబంధనల మేరకు వచ్చే ఏడాది నుంచి ఇంక్రిమెంట్ చెల్లిస్తారని, దీన్ని డబుల్ చేయమని కలెక్టర్ వారిని కోరినట్లు వెల్లడించారు. షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ కింద బేసిక్ వేతనం ఉంటుందని వివరించారు. దీని ప్రకారం పోర్టు కార్మికులంతా వెంటనే విధులకు వెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

అన్ని డిమాండ్లపైనా అడ్డగోలు మెలికలు : కార్మిక నేతలు

అనంతరం యూనియన్ ప్రధానకార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, నిర్వాసిత కార్మికులకు రూ.36వేలు చెల్లించాలని తాము డిమాండ్ చేస్తే, చర్చల్లో యాజమాన్యం ఎంత ఇస్తుందో స్పష్టం చేయలేదన్నారు. తొలగించిన ఉద్యోగులను బేషరతుగా విధుల్లోకి తీసుకున్నప్పుడు, వారిపై తదుపరి విచారణ క్రమశిక్షణ చర్యలంటూ మెలిక ఎందుకని ప్రశ్నించారు. వేతనాలపై స్పష్టత ఇవ్వకుండా విధుల్లోకి వచ్చేది లేదని స్పష్టం చేశారు. ఏ ఒక్కడిమాండ్‌పైనా స్పష్టత లేకుండా అన్నింటికీ మెలికలు పెట్టి, విధుల్లోకి వచ్చేయండంటే ఎలాగని ప్రశ్నించారు.

యూనియన్ ఉపాధ్యక్షులు కోవిరి అప్పలరాజు మాట్లాడుతూ ఆర్‌డిఒ వెల్లడించిన మినిట్స్‌లో గతనెల 8న కలెక్టర్ సమక్షంలో జరిగిన సమావేశంలో డబుల్ ఇంక్రిమెంట్ విషయం పొందుపరచలేదన్నారు. నిర్వాసిత ఉద్యోగులకు ఎంత వేతనం పెంచుతారో చెప్పాలని కోరారు. సబ్బెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రకారం మూలవేతనం చెల్లిస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. గంగవరం పోర్టు షాప్ కాదని, సబ్సిడీ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్‌ను ముందుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక నేతల అభిప్రాయాలను విన్న తర్వాత ఆర్‌డిఒ మాట్లాడుతూ కార్మికులంతా ముందుగా విధులకు హాజరు కావాలని, తదుపరి సమావేశంలో మిగతా విషయాలు మాట్లాడుకుందామంటూ అర్ధాంతరంగా ముగించారు. కార్యక్రమంలో వాసుపిల్లి ఎల్లాజీ, పి.నూకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

'ఉక్కు' జోలికొస్తే


గంగవరం పోర్టుకే నష్టం

స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : తల్లి లాంటి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బ తీసేందుకు గంగవరం పోర్టును ఉపయోగించుకోవడం దుర్మార్గమని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కన్వెర్ర చేస్తే గంగవరం పోర్టుకు అందించాల్సిన అన్ని సదుపాయాలు కనుమరుగు కాక తప్పదని, అందుకే స్టీల్‌ప్లాంట్ జోలికి రాకపోవడమే మంచిదన్న విషయాన్ని గుర్తించాలనిహెచ్చరించారు.

గురువారం మాట్లాడుతూ ముందుగా గంగవరం పోర్టు పుట్టుక గురించి తెలుసుకోవాలన్నారు. గంగవరం పోర్ట్ కోసం 1400 ఎకరాల స్టీల్‌ప్లాంట్ భూమిని కేటాయించి, మంచినీటి సైతం అందిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ వేసిన రోడ్లు వాడుకొని, రైల్వే ట్రాక్‌లో సరుకులు తరలిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన 2.68 లక్షల టన్నుల విదేశీ కోకింగ్ కోల్ ఉంచుకొని స్టీల్‌ప్లాంట్‌ను బెదిరించటం సరైన పద్ధతి కాదన్నారు. గంగవరం పోర్టు కోసం 1400 ఎకరాల స్టీల్‌ప్లాంట్ భూములను ప్రభుత్వం లాక్కొని, స్టీల్ ప్లాంట్‌కు 700 ఎకరాల కొండ ఇచ్చారని, మరో 700 ఎకరాలకు రూ.20.82 కోట్ల పరిహారాన్ని నామమాత్రంగా చెల్లించారన్నారు. ఈ సందర్భంలో గంగవరం పోర్టులో సంక్రమించిన 10.5శాతం వాటాను రాష్ట్రప్రభుత్వం అమ్ముకుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వంపై ప్రైవేట్ వ్యక్తుల దందా ఎంతస్థాయిలో ఉందో స్పష్టమౌతోందన్నారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ జోలికి రాకుండా సజావుగా పని జరిగేలా చూడాలని కోరారు. సిఐటియు స్టీల్‌జోన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ బి అప్పారావు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన భీమిలి టిడిపి నేతలు



చంద్రబాబుతో రాజాబాబు, కార్పొరేటర్ మంగమ్మ

ప్రజాశక్తి- మధురవాడ : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును తెలుగుదేశం పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త కుర్రోడు రాజబాబు, కార్పొరేటర్ పిల్లా మంగమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో టిడిపి ఎదుగుతున్న తీరు, వైసిపి దుర్మార్గాలను ఎండగడుతూ, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరుస్తున్న తీరుపై చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లోనే తెలుగుదేశం పార్టీ ప్రజలకు మరింత దగ్గర అయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేసేలా సమన్వయ పరచాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో పార్టీ వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు ఉన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



గంధం సమర్పణకు వెలుతున్న ముస్లిములు

ప్రజాశక్తి - గాజువాక: విశాఖపట్నం కోటవీధిలో ఉన్న హజరత్ సయ్యద్ అలీ ఇషాక్ మదీనా ఔలియా 766వ ఉరుసు మహోత్సవంలో భాగంగా 27న గురువారం 77వ వార్డు చిన్నపాలెం గ్రామం నుండి హజరత్ సయ్యద్ అలీ ఇషాక్ మదీనా ఔలియాకు సందల్ (గంధం), చాదర్ (పవిత్ర వస్త్రం) సమర్పించారు. కార్యక్రమంలో చిన్నపాలెం మసీద్ కమిటీ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హజరత్ ఇషాక్ మదీనా ఔలియా ఉరుసు ఉత్సవాలు శుక్రవారంతో ముగుస్తాయని మసీదు కమిటీ పెద్దలు తెలిపారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో ముస్లిములు ఈ వేడుకల్లో పాల్గొని సందల్‌గంధం, పవిత్ర వస్త్రం సమర్పిస్తారన్నారు.

అర్హులకు నేరుగా సంక్షేమ లబ్ధి లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : అర్హులైన ప్రతిఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలన్నదే సిఎం జగన్మోహనరెడ్డి సంకల్పమని, అందుకే వినూత్న పథకాలను అమలు చేస్తున్నారని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం 44వ వార్డు శ్రీనివాసనగర్-1 సచివాలయం, రామచంద్రనగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా శాంతి స్వరూపిణి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సప్పంగి శ్రీను, డైరెక్టర్ రాయుడు శ్రీను, స్థానిక వార్డు నాయకులు హబీబ్, హీర, వెంకటరావు, వాసు, గోపి, సీతారాం, రెడ్డి, కాయల రామారావు, ప్రసాద్, బషీర్, ముత్యాలు, తిరుపతి, బేగం, షేక్ బాబ్జి, భోగవల్లి గోవింద్, నేపాల్ శ్రీను, గాలి ప్రసాద్, అశోక్, రమణమ్మ, భాను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు రామచంద్రనగర్ ప్రాంతంలో రూ.58 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఇ రమణమ్మ పాల్గొన్నారు.

జస్విన్ ప్రొడక్షన్ సినిమా షూటింగ్



షూటింగ్ ప్రారంభోత్సవంలో చిత్రయూనిట్‌తో అతిథులు

ప్రజాశక్తి -గాజువాక :జస్విన్ సినిమా, ప్రొడక్షన్ నెంబర్ -2 చిత్రం షూటింగ్ గురువారం కొత్త గాజువాక, బిసి రోడ్డు సీతారాంనగర్‌లో ప్రారంభమైంది. గాజువాక ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో రత్నకాంత్, హీరోయిన్ నీహారికలపై ముహూర్తపు షాట్‌కు గాజువాక ఎస్ఐ కె.సతీష్‌కుమార్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, జస్విన్ సినిమాస్ ప్రొడక్షన్ నెంబరు -2 చిత్రషూటింగ్ గాజువాకలో ప్రారంభించి, ఇక్కడే జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా చిత్రషూటింగ్ పూర్తి కావాలని, ఆకాంక్షించారు. గాజువాకకు మంచి పేరు తెచ్చేలా సినిమా చిత్రీకరణ జరపాలని యూనిట్ సభ్యులను కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో చిత్ర నిర్మాత బెన్నాబత్తుల బ్రహ్మాజీ, దర్శకుడు ఉదయకుమార్, డిఒపి సంతోష్, డిజెఎ, అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, నవ్వుల దామోదర్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరంతో గ్రామసభ వాయిదా

రీసర్వే లోపభూయిష్టమని ఆరోపణ

డ్రాఫ్ట్ కాపీలో తప్పులున్నాయని ఆక్షేపణ



సర్వే తీరుపై అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రజాశక్తి -తగరపువలస : సింగనబంద పంచాయితీలో ఇటీవల నిర్వహించిన సమగ్ర భూ రీసర్వే లోపభూయిష్టంగా ఉందని, డ్రాఫ్ట్ కాపీ తప్పుల తడకగా ఉందని రైతుల అభ్యంతరంతో గురువారం ఆ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభ అర్ధాంతరంగా వాయిదా పడింది. గ్రామసభ ఏర్పాటు ఆవశ్యకతను తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ వివరించగా, ఇంతలో పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూ రీసర్వే అనంతరం తయారు చేసిన డ్రాఫ్ట్ కాపీలో అనేక తప్పులున్నాయని, ముందుగా వాటిని సరిచేయాలని కోరారు. దీనిపై భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు మాట్లాడుతూ, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, మరల సమగ్ర భూసర్వే జరపాలని సూచించారు.ఎంతోకాలంగా రైతుల అధీనంలో ఉన్న భూములకు వారికే హక్కు కల్పించాలన్నారు. సమగ్ర సర్వే జరిపేటప్పుడు రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. వారి సమక్షంలోనే భూముల సరిహద్దులను నిర్ధారించాలన్నారు. ఒకవైపు రైతుల అభ్యంతరాలతోపాటు జెడ్‌పిటిసి సూచన మేరకు తహశీల్దార్ వేణుగోపాల్ గ్రామసభను వాయిదా వేశారు. సర్పంచ్ జివి.నారాయణ, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు పాల్గొన్నారు

పట్టణ ఆరోగ్య కేంద్రానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : 25వ వార్డు సీతమ్మ పేట, గణేష్ నగర్ సచివాలయం పక్కన నూతనంగా వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అధికారులతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ స్థలపరిశీలన చేశారు. బిటిఆర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం, వార్డులో పలు అభివృద్ధి పనులకు పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయ లక్ష్మి, తహశీల్దార్ ఆనంద్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎఇలు రహీమ్, ప్రభ, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సప్పంగి శ్రీను, స్థానిక నేతలు భోగవల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, సానబోయిన సురేష్, హరికృష్ణ, వెంకటేష్, బొమ్మాళి రవి, గోవిందమ్మ, సన్నీ, అప్పన్న, గౌరీనాయుడు, రాజు, బోర గోవింద్, బోర శ్రీను, బోర వెంకటరమణ పాల్గొన్నారు.

'మణిపూర్' అకృత్యాలపై నిరసనలు



జగదాంబ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మణిపూర్‌లో కొద్ది రోజులుగా చోటుచేసుకుంటున్న అకృత్యాలు, దారుణాలపై విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారమూ నిరసనలు వెల్లువెత్తాయి. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మణిపూర్ అల్లర్లలో భాగంగా ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించటాన్ని ఖండిస్తూ సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సిఐటియు కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడారు. మణిపూర్‌లో అల్లర్లు రోజురోజుకూ పెరుగుతూ ఉంటే స్పందించాల్సిన ప్రధానమంత్రి మోడీ నోరుమెదపకపోవడం దారుణమన్నారు. బిజెపి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి చూస్తోందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, నాయకులు సీతామహలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, మంగ్రశ్రీ పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దమనకాండను అరికట్టాలని, ఆ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ గురువారం డాబాగార్డెన్స్ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, బిఎస్ఎన్ఎల్ వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు పిజిసిహెచ్‌విఎస్.సాగర్, మీనా కుమారి పాల్గొన్నారు. మణిపూర్ హింసాకాండను ఆపాలని, శాంతిని నెలకొల్పాలని కోరుతూ భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు భారత రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి లేఖలు రాశారు.

న్యాయవాదుల నిరసన

అనకాపల్లి : మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయ, హేయమైన సంఘటనలను, గృహ దహనాలను, మహిళలపై దాడులను ఖండిస్తూ అనకాపల్లి బార్ అసోసియేషన్, భారత న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కోర్టుల సముదాయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సాయిలక్ష్మణ్, శ్రీనివాస్, మాధవరావు ఎం.ఎ.సుధాకర్, గంగాధర్, రాజు, నూకరాజు, సురేష్ బాబు మాట్లాడుతూ దేశం పరువు పోయేలాంటి ఇలాంటి సంఘటనలు మే 3న ప్రారంభమైతే ఇంతవరకు అదుపుచేయలేని పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. ఈ దమన కాండను అదుపు చేయలేని చేతకాని ప్రభుత్వాలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత విముక్తి నిరసన

మణిపూర్ ముఖ్యమంత్రి బిరెన్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరుతూ స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత విముక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ దేశం మొత్తం తలదించుకునే విధంగా మణిపూర్‌లో కుకీ తెగ ఆదివాసీ మహిళలపై లైంగిక అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అదుపు చేయడంలో బిజెపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. దీని వెనుక బిజెపి, ఆర్ఎస్ఎస్, మనువాద సంస్థల కుట్రలు ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, బి సన్యాసమ్మ, కంకణాల శ్రీనివాసరావు, కొల్లు సత్యారావు, షేక్ మదీనా, హేమంత్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


మల్లునాయుడుకు కేక్ తినిపిస్తున్న చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో మల్లునాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అమరావతిలో చంద్రబాబు సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ గూనూరు మల్లు నాయుడు జన్మదినాన్ని చంద్రబాబు సమక్షంలో జరుపుకున్నారు. చంద్రబాబు కేక్ కట్‌చేసి మల్లు నాయుడుకు తినిపించారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారం చేపట్టబోతుందని అందుకోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని చంద్రబాబు తమకు సూచించినట్లు మల్లు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ జెడ్‌పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, రాజాన కొండమనాయుడు, గుమ్ములూరి చంద్రమౌళి, గోకివాడ కోటేశ్వరరావు, గూనూరు పెద్ద అచ్చిబాబు, కొల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తుకు తుది గడువు ఆగస్టు 31

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతికి దరఖాస్తు చేసుకునే వారి వయసు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు ఉండాలని, రికార్డు షీటు లేదా టిసి, ఆధార్ కార్డు, తల్లి /తండ్రి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు అయితే ధ్రువీకరణ పత్రం, ఎటువంటి విద్యార్హతలు లేకుండా జనన ధ్రువీకరణ పత్రం, చదవడం రాయడం వచ్చని స్వీయ ధ్రువీకరణ పత్రంతో నేరుగా పదవ తరగతిలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువ పత్రంతోపాటు పైన పదవ తరగతి ప్రవేశం కోసం తెలిపిన ధ్రువపత్రాలతో ప్రవేశం పొందవచ్చని డీఈవో వెంకట లక్ష్మమ్మ పేర్కొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అధునాతన వసతులతో మరింత అభివృద్ధి చేస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు. గురువారం సబ్బవరం మండల వైఎస్ఆర్‌పి నాయకులతో పిహెచ్‌సిని సందర్శించి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా సుమారు కోటి రూపాయలతో పిహెచ్‌సి అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే కాంట్రాక్టర్ కొన్ని సమస్యల వల్ల ఆ పనులు పూర్తి చేయలేకపోయారని, దీంతో మరో ఐదు శాతం నిధులు పెంచి అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా వరదలు, తుపాను, తదితర భయంకరమైన విపత్తులు జరిగినప్పుడు తక్షణ వైద్య సహాయం అందించేలా మరికొన్ని బ్లాకులు ఇక్కడ నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కర్రి బాబు, సీనియర్ నాయకులు కోటాన రాము, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, సబ్బవరపు ముత్యాల నాయుడు, మండల లక్ష్మణ, వనం అచ్చం నాయుడు, టీ శేఖర్, దేద్దం పద్మావతి, బంతి కోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మహిళలకు కరపత్రాలు ఇస్తున్న మంత్రి అమర్‌నాథ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలో కస్పవీధి, ఉప్పునీటి దిబ్బ వీధి ప్రాంతాల్లో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు పెద్దపేట వేశామని చెప్పారు. అనంతరం ప్రజలకు అర్హత పత్రం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపిపి కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, జడ్పిటిసి దంతులూరు శ్రీధర్ రాజు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి రజిని తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనాల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

పరవాడ : మండలంలోని తానాం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బూసి అప్పల రాజు, వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపీటీసీలు అర్జిల్లి దేవి రవి, గొల్లవిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి - దేవరాపల్లి : 2023-2024 ఖరీఫ్ పంట నమోదు గురించి స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మ ఆధ్వర్యాన వ్యవసాయ సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ రైతులందరికీ పంట నమోదు ప్రాముఖ్యత గురించి తెలిసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనాలు అమలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం స్కీమ్‌లలో పనిచేస్తున్న వాల్ అండ్ పంప్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషన్లు, వాచ్మెన్ తదితర కాంట్రాక్టు కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందిస్తున్న కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా థర్డ్ పార్టీ కార్మికులగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపార్టుమెంట్కు ఎటువంటి సంబంధం లేనట్లుగా అధికార్లు వ్యవహరిస్తున్నారని, వీరికి రూ.4వేలు నుండి రూ.9వేలు లోపే జీతాలు ఇస్తున్నారని, ఆ మొత్తం కూడా నెలల తరబడి బకాయిలు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. వచ్చే అరకొర జీతాలు నెలల తరబడి అందకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని, కనీసం టెండర్ నిబంధన ప్రకారం కూడా జీతాలు చెల్లించలేదని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ప్రభుత్వాలు మారితే కార్మికులను తొలగించడం, కాంట్రాక్టర్ ఇష్టానుసారం ఉద్యోగాల నుండి తొలగింపులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రినాథరావు, రమణ, ప్రసాద్, నూకరాజు , అప్పలరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం అధికారులకు, ఆర్డీఓ చిన్ని కృష్ణకి వినతి పత్రాలు వేరువేరుగా అందజేశారు.

పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను రైతులకు మరింత చేరువ కల్పించేందుకు 1.25 లక్షల కేంద్రాలను ప్రారంభించారని మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమాన్ని రైతులతో పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అతి తక్కువ ధరలకే విక్రయించడం, మంచి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ఈ కేంద్రాల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడపురెడ్డి శ్రీనివాసరావు, అప్పలకొండ కుమార్, బర్రె వెంకట్రావు పాత్రుడు, శివ స్వామి నాయుడు, వ్యవసాయాధికారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యకర జీవితం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న అన్నారు. తుమ్మపాల శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో మూడు రోజులపాటు నిర్వహించే ప్రకృతి వ్యవసాయ, రైతు శాస్త్రవేత్తల శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఎఎస్ అధికారి టి.విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ అధికారులు జూమ్ కాల్ ద్వారా మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ఖర్చు తగ్గించి, నాణ్యమైన దిగుబడులు ప్రకృతి వ్యవసాయంలో సాధించవచ్చునని తెలిపారు. ప్రతి పంటలో బహుళ పంటలు 365 రోజులు పండించే విధానాలపై గ్రామాల్లో రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణారావు, టెక్నికల్ లీడ్ ప్రకాష్ రావు, రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ దేవుళ్ళు , ప్రకృతి వ్యవసాయ శిక్షకులు భాస్కరరావు, ప్రాంతీయ పరిశోధన స్థానం డాక్టర్ రమణ మూర్తి, రాష్ట్రస్థాయి ట్రైనర్స్, గ్రామ సర్పంచ్ పెంటయ్య నాయుడు, ఎంపిటిసి సభ్యులు పంచదార్ల కన్నారావు, పన్నీర్ వెంకటలక్ష్మి, చదరం నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి, జిల్లా కోఆర్డినేటర్ కీర్తి గోవిందు, మెంటర్స్, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు



క్రికెట్ కిట్లు అందజేస్తున్న జనసేన నాయకులు కృష్ణ

యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కె.సంతపాలెం గ్రామానికి చెందిన యువతకి జనసేన పార్టీ మాడుగుల నియోజవర్గం నాయకులు రాయపు రెడ్డి కృష్ణ సమకూర్చిన క్రికెట్ కిట్లను గురువారం ఆ పార్టీ గ్రామ నాయకులు చుక్క నారాయణమూర్తి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో తాను రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుంచి నేటి వరకు ప్రతి గ్రామంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అన్ని వర్గాల వారికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికీ అన్ని గ్రామాలలో ఏదో విధంగా తన వంతుగా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉగ్గిన త్రినాథ్, నాయకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బొడ్డేడ ప్రసాద్

గుండె సంబంధిత వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ సర్జరీకై దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుడు దొడ్డి రామకృష్ణకు వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆర్థిక సహాయం అందజేశారు. మునగపాక గ్రామానికి చెందిన దొడ్డి రామకృష్ణ కొంతకాలంగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు గుండె మార్పిడి సర్జరీ అవసరం అవుతుందని, చికిత్స నిమిత్తం 35 లక్షల ఖర్చు అవుతాయని తెలిపారు. రామకృష్ణ తండ్రి గణేష్ దంపతులు దాతల సహాయాన్ని అర్థించారు. పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయంగా అతని ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.

దోమల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం గవరపాలెం శాంతి నగర్ నూతిలో గంబూసియా చేపలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె గంబూసియా చేపలు వెయ్యడం వలన నీటిలోవున్న దోమలు లార్వాను చేపలు తినడం వలన దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. దీనివల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందని చెప్పారు. గంబూసియా చేపలు నూతిలో, చెరువులో, నీరు ఎక్కువగా వున్న ప్రదేశాలలో వేయడం ద్వారా దోమల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

టేకు స్వాధీనం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రానికి సమీపంలోని అటవీ చెక్ పోస్ట్ వద్ద బుధవారం టేకు కలపను అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. టేక్ కలప తరలిస్తున్న వ్యక్తికి రూ.2.65 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు చోడవరం రేంజ్ అధికారి ఈవి రవి వర్మ తెలిపారు. పట్టుబడిన రెండు వాహనాల్లోని కలపను తమ సిబ్బంది సహాయంతో గురువారం కొలతలు వేసినట్లు చెప్పారు. అనంతగిరి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న 104, టేకు దుగలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, రెండు వాహనాలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.



టేకు దుంగలను స్వాధీనం చేసుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

ఫారెస్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ

తిరుమల తిరుపతి దేవస్థానం ఫారెస్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ పరవాడ ఫార్మాసిటీలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న 200 మంది ఫారెస్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. రూ.2.5 లక్షల కోట్లు ఆదాయం కలిగి ఉండని, ఈ దేవస్థానంలో పనిచేస్తున్న ప్రధాన అర్చకులకు రూ.82 వేలు జీతం, చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. కాని ఫారెస్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన దానిని అమలు చేయకపోవడం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మొండి వైఖరి నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. 1000 రోజులుగా కార్మికుల ఆందోళన చేస్తున్న ప్రభుత్వంలోనూ పాలకవర్గంలో చలన లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆదారి రాజా, సత్తిబాబు, రమణ, ధారబాబు, వెంకట్రావు, రాము, కృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి లింగమూర్తి ఎనలేని కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి వర్తక సంఘం తరపున విద్యా రంగానికి కోరుకొండ లింగమూర్తి ఎనలేని కృషి చేశారని ఏఎంఏఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు అన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో ఫౌండర్స్ డే, అనకాపల్లి వర్తక సంఘ వ్యవస్థాపకులు కోరుకొండ లింగమూర్తి వర్ధంతి సందర్భంగా కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వర రావు మాట్లాడుతూ కోరుకొండ లింగమూర్తి ఎంతో సుదీర్ఘ ఆలోచనతో అనకాపల్లి వర్తక సంఘాన్ని స్థాపించి విద్య, వైద్య రంగాలలో పేదలకు సేవ చేయాలనే దక్పథంతో మెటర్నిటీ ఆసుపత్రి, కళాశాల, హైస్కూల్‌ని స్థాపించటంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు బాలకృష్ణ, సోమునాయుడు, గుప్తా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, ఉపాధ్యక్షులు కెఎస్ఎన్ శర్మ, సభ్యులు సత్యనారాయణ, రాజేశ్వరప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

నాగ జగదీష్ జన్మదిన వేడుకలకు హాజరైన వారికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వర రావు జన్మదిన వేడుకలకు హాజరైన మాజీ మంత్రులు ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు, టిడిపి జిల్లా నాయకులు, శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కేవిఎ నారాయణరావు తెలిపారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో గురువారం డాక్టర్ కేకే వి ఏ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నాగ జగదీష్ జన్మదిన వేడుకలకు అత్యంత అట్టహాసంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల వెంకటరావు, కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, దూలం ప్రసాద్, మళ్ల గణేష్, మళ్ల శివన్నారాయణ, బుద్ధ భువనేశ్వర్ రావు, అండిబోయిన శేషు, కర్రి మల్లేశ్వరరావు, వేగి వెంకటరావు, యలమంచిలి బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు

దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న ఐదు సంవత్సరాల చిన్నారికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. చౌడువాడ గ్రామానికి చెందిన చిన్నారి రొంగలి జోగేష్ మెదడ సంబంధించిన వ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిప్పుతున్న వ్యాధి నయం కావడం లేదు. చిన్నారి తల్లిదండ్రుల బాధను చూసి ఆర్గనైజేషన్ ప్రతినిధులు ద్వారపూడి ఫణీంద్ర భోగేశులు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. సంస్థ ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు.

బిఎన్ రోడ్డు పరిశీలన

- కాంట్రాక్టరు, అధికారులను నిలదీసిన నాయకులు

ప్రజాశక్తి -వడ్డాది

భీమిలి -నర్సీపట్నం రోడ్డును గురువారం కాంట్రాక్టర్‌తో ఆర్ అండ్ బి అధికారులు పరిశీలించారు. విషయం తెలుసుకున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, వైస్ ఎంపిపి దొండా నారాయణమూర్తి, వైసిపి సీనియర్ నాయకుడు ఎన్నంశెట్టి అచ్చం నాయుడు, ఎంపిటిసి గోవిందరావు, స్థానిక ప్రజలు కాంట్రాక్టర్ ధర్మ తేజను, ఆర్ అండ్ బి డిఈ నాగ మోహన్ రావు వడ్డాది, బుదిరెడ్డపాలెం గ్రామాల్లో నిలదీశారు. మీ వల్లే మా ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకు చెడ్డ పేరు వస్తుందని ఆరోపించారు. ఈ రోడ్డు గాని త్వరగా పూర్తి చేయకపోతే ఆర్ అండ్ బి ఆఫీసును ముట్టడిస్తామని, రోడ్డుమీద ఆందోళన చేస్తామని తెలిపారు. రోడ్డుమీద బైక్, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, నిలిపివేసి గంట సేపు నిరసన తెలియజేశారు.



చంద్రబాబుతో కిల్లంపల్లి శ్రీనివాస్

ఐటిడిపి కార్యదర్శిగా కిల్లంపల్లి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శిగా బుచ్చయ్యపేట మండలం సీతయ్యపేట గ్రామానికి చెందిన కిల్లంపల్లి శ్రీనివాసును నియమించారు. ఈ సందర్భంగా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్లు గురువారం తెలిపారు. పార్టీకి నిస్వార్థంగా చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ అవకాశం వచ్చిందని తెలిపారు. పార్టీ అధికారంలోనికి వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఇన్చార్జి తాతయ్య బాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయాన్ని నట్టేట ముంచిన జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో వ్యవసాయాన్ని నట్టేట ముంచారని, అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సుమారు 40 వేల మంది కౌలు రైతులు ఉండగా 5 వేల మందికి కూడా గుర్తింపు కార్డులు ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఏ ఒక్కటి కూడా పూర్తిగా నెరవేరలేదని, రైతు భరోసా కేంద్రాలలో ఆర్భాటం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదని తెలిపారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు క్రాప్ హాలిడేస్ ప్రకటిస్తున్న వైనం ఒక జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నామని మండిపడ్డారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం అప్పులతో కాలం గడపడం వల్ల కేంద్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం వల్ల ఎస్సీ ఎస్టీ బీసీ రైతాంగం కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వహణ కార్యదర్శి దాడి ముసలి నాయుడు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మల్లవరపు నరసింహారావు, చోడవరం ఎక్స్ ఎంపీపీ గూనూరు పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి-దేవరాపల్లి : తూతూ మంత్రంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న తెలిపారు. గురువారం వాలాబు పంచాయతీ పరిధిలో జరిగిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నామమాత్రంగా జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న 104 డాక్టర్లను తొలగించి ఫ్యామిలీ ఫిజిషియన్ పెట్టినా వైద్యం మాత్రం అందడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమై గ్రామాల్లో రోగులు సంఖ్య పెరుగుతుందని, మలేరియా కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ప్రజాశక్తి 7
శుక్రవారం 28 జులై 2023

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ నరేష్ సూచించారు. స్థానిక ఈబీసీ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న అభ్యసనా సామర్థ్యాలను, రికార్డులను పరిశీలించారు. వెనుక బడిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందించాలని, అభ్యసన కృత్యాలతో బోధన చేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలల సందర్శన సమయంలో వెనుకబడిన విద్యార్థుల కోసం అమలు చేస్తున్న అంశాలను తెలియజేయాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచిగా శుచిగా భోజనాన్ని అందించాలని సూచించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు .

కోటవురట్ల:విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి టి.రామారావు సూచించారు.గురువారం కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మెను వివరాలు అడిగి తెలుసు కోవడంతో పాటు వాటిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చిన్నారులకు అందించాల్సిన వసతుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఎంఈఓ 2 జాన్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి సరితా దేవి ఉన్నారు.

ఓటర్ల సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పరిశీలిస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తిగొలుగొండ: మండలంలోని జోగంపేట గ్రామంలో ఓటర్ల వెరిఫికేషన్‌ను గురువారం నర్సీపట్నం ఆర్డీఓ జయరాం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ పనితీరుపై పర్యవేక్షించారు. జోగంపేట బీసీ కాలనీలో కొంతమంది ఓటర్లను బిఎల్ఓ పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహశీల్దార్ జి.ఆనంద్ ఉన్నారు.

నక్కపల్లి:ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటా ఓటర్ సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అంబేద్కర్ అన్నారు. నక్కపల్లిలో పోలింగ్ స్టేషన్ 209, 212 లో బూత్ లెవెల్ అధికారులు చేపట్టిన ఇంటింటా ఓటర్ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఓటర్ సర్వే ప్రక్రియలో బిఎల్ఓలు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటివి నిష్పక్షపాతంగా చేపట్టాలని ఆదేశించారు. స్పష్టమైన పూర్తి ఆధారాలు ఉంటేనే మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ సర్వే జరుగుతుందన్నారు.

కోటవురట్ల:మండలంలో చేపడుతున్న ఓటర్ ధృవీకరణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు జానకమ్మ తెలిపారు. గురువారం ఆమె బికెపల్లి, రామచంద్రపాలెం గ్రామాలలో జరుగుతున్న ఓటర్ ధ్రువీకరణ సర్వేను బూత్ స్థాయి అధికారులతో పరిశీలించారు. విధుల పట్ల అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా బూత్ ఏజెంట్ల సమక్షంలో ఓటర్ ధ్రువీకరణ కార్యక్రమం జరగాలని సూచించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంలో విద్యార్థులతో ఆమె కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆమె బికెపల్లి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న జగనన్న భూ సర్వే వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూ సర్వే జరుగుతున్న తీరు పరిశీలించారు. భూ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వీఆర్ఓలు అనూష, హంసాదేవి, విలేజ్ సర్వేయర్లు నవ్య, శిభా పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ జానకమ్మ

రోడ్డు విస్తరణపై వదంతులు నమ్మొద్దు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభుత్వం నుండి 80 అడుగుల జీవో వచ్చిందని వస్తున్న వదంతులు నమ్మ వద్దని నర్సీపట్నం పురపాలక సంఘం కమిషనర్ కనకారావు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోని 90 అడుగులకు తగ్గేది లేదని తెలిపారు. ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ భవన యజమానులు, గృహాలకు వెళ్లి వారిని కలియగా 90 అడుగులకు అంగీకారం తెలిపారన్నారు. బాధితులకు టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామన్నారు. 100 అడుగుల విస్తరణ జరిగితే నష్టపోతున్న భవన యజమానులు ధన రూపంలో నష్టపరిహారం చెల్లిస్తామని కమిషనర్ తెలిపారు. అపోహలు నమ్మవద్దని రోడ్డు విస్తరణ కచ్చితంగా జరుగుతుందని పునరుద్ఘాటించారు.

తప్పుడు నివేదికపై అధికారులు విచారించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రోలుగుంట మండలంలో వికలాంగుల సమైక్యలో డిఆర్డిఏ ద్వారా మంజూరు చేసిన రూ.40 లక్షల రుణాలలో జరిగిన అక్రమాలపై అప్పట్లో పని చేసిన ఏరియా కోఆర్డినేటర్ పై విచారణ జరిపి తప్పుడు నివేదిక ఇచ్చారని ప్రజా సంకల్ప వేదిక జిల్లా అధ్యక్షుడు ముప్పిన వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అక్రమాలపై అప్పట్లో పని చేసిన ఏరియా కోఆర్డినేటర్‌పై విచారణ జరిపి నివేదిక అందించాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. 40 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ రుణాలు వికలాంగులకు అందించకుండా బినామీల పేరుతో అప్పట్లో పని చేసిన ఉద్యోగులే స్వాహా చేశారని విమర్శించారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సొమ్మును రికవరీ చేయలేదని, ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. విచారణలో రుణాలు పొందిన వారిలో 120 మంది చనిపోయారని, మరి కొంతమంది వలస పోయారని తప్పుడు నివేదిక ఇచ్చి జిల్లా కలెక్టరును తప్పుతోవ పట్టించారన్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని వెంకటరమణ చెప్పారు.



మాట్లాడుతున్న నాయకులు

టిడిపితో బిసిల అభివృద్ధి

ప్రజాశక్తి-యస్.రాయవరం:టిడిపితోనే బిసిల అభివృద్ధి సాధ్యం బిసి సాధికార రాష్ట్ర యాతకమిటీ కన్వీనర్ ఒనుం శ్రీనువాస్ అన్నారు. బుధవారం రాత్రి గుర్రాజుపేట గ్రామంలో జరిగిన భవిష్యత్తు గ్యారంటీ గ్రామ పోరుబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వెనుకబడిన గీత కార్మికులకు, యాదవులకు, ఇతర వెనుకబడిన తరగతుల కులాలందరికీ టిడిపి ప్రభుత్వం వస్తేనే అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర యాత కమిటీ డైరెక్టర్ గుత్తుర్తి పాండురంగ మాట్లాడుతూ, గీత కార్మికుల కోసం గీతన్న నేస్తం, పదిలక్షల ఎక్స్ గ్రేషియా, వంటివి సాధించుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి నాయకుడు కురందాసు శ్రీనువాస్, గొంప సింహాచలం, మునసా రాజులు, అండిబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై కేసు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద విచారణకు హాజరైన ఒక మహిళపై అసభ్య పదజాలంతో దూషించి, అంతు చూస్తానని బెదిరించిన కొత్తకోట కు చెందిన రౌడీ షీటర్ పై కేసు నమోదు చేసినట్టు రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాల మేరకు కొత్తకోటకు చెందిన గరగా సత్యవతి ఈ నెల 15న భూ వివాదం పై రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో ఒక విచారణకు హాజరైంది. అనంతరం ఇంటికి వెళ్తున్న ఆమెపై కొత్తకోట గ్రామానికి చెందిన రౌడీషీటర్ మళ్లేటి రమణ తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడమే కాక అట్రాసిటీ కేసులు నమోదు చేయించి నీ సంగతి తేలుస్తానంటూ బెదిరించాడు. దీంతో, ఆమె రమణపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని పిర్యాదు చేయగా విచారణ అనంతరం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలో దిబ్బపాలెం గ్రామ యువతకు మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపరెడ్డి కృష్ణ క్రికెట్ కిట్ ను రాము, శివ తులసీరామ్ చేతుల మీదుగా గ్రామ యువతకు అందజేశారు. అడిగిన వెంటనే క్రికెట్ కిట్ అందించినందుకు దిబ్బపాలెం గ్రామ జనసైనికులు రాయపరెడ్డి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దిబ్బపాలెం యువకులు గణేష్, రాము , శివ, తులసి రామ్, చెర్రీ, రాజేష్ గ్రామ జనసేన నాయకులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎఒ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -యస్.రాయవరం:మండలంలో పలు చోట్ల గురువారం ఉదయం వ్యవసాయ అధికారి సౌజన్య ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు రైతులకు ఎంఆర్ పి ధరలకే అమ్మకం జరపాలని సూచించారు. అధిక ధరలకు అమ్మితే తమకు పిర్యాదు చేసినట్ల యితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న గృహాల సముదాయములో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణను గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్ మెయిన్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదవాడి సొంతంటి కలను నెరవేర్చి వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జాన్సీ, సచివాలయ లైన్‌మేన్ నాని, జగదీశ్, సాయి పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ స్విచ్ ఆన్ చేస్తున్న సర్పంచ్

ఆలయాలకు విరాళం



విరాళం అందజేస్తున్న రామానాయుడు

ప్రజాశక్తి -మాడుగుల:పోతనపూడి గ్రామంలో నిర్మాణం అవుతున్న పైడిమాంబ ఆలయానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు రూ.15 వేల విరాళం అందించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆయన గురువారం నగదు అందించగా, ఆయన తో పాటు మడగల రమేష్ రూ.5000, గుడివాడ సూరిబాబు రూ.2500 విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ భవాని సాంబ మూర్తి, మాజీ సర్పంచ్ సూరి అప్పారావు, పెంటకోట రాము, మడగల రమణ, మైచర్ల నానాజీ, వేపాడ రామారావు, చిన్ని రాము, అప్పారావు, పైడి రాజు, శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు

మాడుగుల మండల కేంద్రంలోని సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి టిడిపి నేత పైలా ప్రసాద్ రావు గురువారం రూ.20 వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు క్లబ్ సభ్యులు మండల సతీష్, టిడిపి నేతలు రంజిత్ వర్మ, కొట్నాల త్రినాథ్, పుప్పాల రమేష్, పైడి నాయుడు, ఆడిటర్ మూర్తి, కోడూరు సూరిబాబు, జాన్నపల్లి రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న లోకనాథం, నాయకులు

గిరిజనులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని గిరిజనులు చేపట్టిన దీక్షలకు ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం విమర్శించారు. 21 రోజులుగా గిరిజనులు చేపడుతున్న దీక్షలకు గురువారం ఆయన మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలపై ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయాలు వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు అప్పలరాజు, డేవిడ్‌రాజు, సత్యనారాయణ, రాజుబాబు, రమేష్, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-రావికమతం: పచ్చదనానికి మొక్కలు ఎంతగానో దోహద పడతాయని సర్పంచ్ దాసరి సూర్య కుమారి తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో గురువారం 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ, కొన్ని మొక్కలు ఔషధానికి, కలపకు, పండ్లు, కాయలు ఇస్తాయన్నారు. ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీఓ కాశి, టిఎ మోహన్ సహకారంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి -కలెక్టరేట్ : ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సినీ సంగీత విభావరి అందరినీ అలరించింది. ఎం.త్రినాధరావు, ఎం.రమణి, కె.లోకేష్, లక్ష్మి స్వరూప, బంగార్రాజు, సావిత్రి, రాజారావు, వాన లక్ష్మి, పెమ్మరాజు రామ్, నూకల రామ నరసింహం, జగదీష్ కుమార్, గౌరి, వి.రాంబాబు, గెంబలి జగదీష్ తదితరులు కొత్త పాత పాటలు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తొలుత వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ కళలతో అందరికీ వినోదం పంచుతున్న కళాకారులకు ప్రభుత్వాలు జీవనోపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు ఫణి స్వామి, జెఎంఆర్ నెహ్రూ, మెలోడీ సత్యనారాయణ, ఎమ్మెస్ మాధవ్, వైవి.రావు తదితరులు పాల్గొన్నారు.

40 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో జరిగింది. అజెండాలో 40 అంశాలు పొందుపరిచగా అన్నీ ఆమోదం పొందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.519.63 లక్షల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలకు అదనపు పారిశుధ్య కార్మికుల ఏర్పాటు, కుక్కల నిర్మూలన, గన్‌మ్యాన్‌ల ఏర్పాటు తదితర పనులకు సంబంధించి సుమారు రూ.1.30 కోట్లుకు ఆమోదం లభించింది. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు పట్టణ ప్రణాళికాధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్ సింహాచలం, సిటీ వెటర్నరీ డాక్టర్ కిషోర్, ఎఎంఒహెచ్‌లు డాక్టర్ రాజేష్, డాక్టర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జనార్ధన్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గురువారం గ్రంధాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ, అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగానూ, భారత రాష్ట్రపతిగా పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు .

కరాస: జివిఎంసి 52వ వార్డు సంజీవయ్య నగర్‌లో మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖాసిం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కలాం విగ్రహానికి రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి రమణమూర్తి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అబ్దుల్ కలాం సేవలు దేశానికి చేసిన సేవలను కొనియాడి, వాటిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్రిపాలెం బ్రహ్మకుమారిస్ ఇన్‌ఛార్జి బికె.విమలాదేవి, బికె.పూర్ణచంద్రరావు, పర్వతనేని హరికిషన్, వికెవైఎస్.మూర్తి, షేక్ ఇబ్రహీం, షేక్ అబ్దుల్ ఖలీఫా, ముత్యాల రవికుమార్, ముత్యాల శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు

పిఎం పాలెం: చంద్రపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు నాగోతు సూర్యప్రకాష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బెల్ల పాపారావు, జగన్మోహన్ చౌదరి, బైపల్లి సతీష్‌కుమార్, మామిడి వరలక్ష్మి, ఎస్‌సి.రమణ, కాకి నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కావ్య రెడ్డి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి ప్రిన్సిపల్ సిహెచ్ సూర్యప్రసాద్, పూలమాలలు వేసి నివాళులర్పించారు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి.వేణుగోపాల్, కె ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు

టిడిపి ఆధ్వర్యంలో... స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కలాం విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కె అప్పలనాయుడు, ఎస్ జోగారావు, కె కామేష్, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆళ్ళ ప్రవీణ్ కుమార్, అబ్దుల్ కలాం సేవా సంఘం ప్రతినిధి గంగలకుర్తి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా జార్జి క్లబ్ దగ్గర వున్న కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, కోరిబిల్లి రమేష్, నరిసే చిరంజీవి, పెతకంశెట్టి జగన్మోహన్ రావు, కోటిపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి దుర్గనాయుడు, గోంతిన నాయుడుబాబు, జెర్రిపోతుల నూకునాయుడు, తెరపల్లి శ్రీను, నారిపల్లి ప్రసాద్, తాడేలు సూరిబాబు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు



సమస్యలు తెలుసుకుంటున్న బూడి

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలోని అర్జునగిరి గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గడపగడపకు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. కొంతమంది గ్రామ మహిళలు ఇళ్ల స్కీములు కావాలని మొరపెట్టుకోగా ఉప ముఖ్యమంత్రి తక్షణమే హౌసింగ్ విభాగానికి సంబంధించిన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని, గ్రామ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ నారాయణమూర్తి, జెడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, గ్రామ సర్పంచ్ బోడాల రామలక్ష్మి శ్రీను, తహసిల్దార్ బివి రాణి, ఎంపీడీవో జయప్రకాష్, పార్టీ మండల కన్వీనర్ రాజబాబు వైసిపి నాయకులు ధర్మిశెట్టి కొండబాబు, చైతన్య, రమణబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

పథకాలపై ఎమ్మెల్యే గణేష్ ఆరా

నర్సీపట్నం టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం 22వ వార్డులో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పర్యటించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పథకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలను చూపించారు.

స్థానికులు రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం కొందరు కోరారు. జగనన్న సచివాలయాలు కన్వీనర్ 14వ వార్డు ఇన్చార్జ్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ ఆయన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, 22వ ఇంఛార్జి పెట్లా నాయుడు, అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ కర్రి కనక మహాలక్ష్మి, షిరిడీ సాయి దేవస్థానం నిర్వాహకులు కర్రి రాంగోపాల్, సీనియర్ వైసీపీ నాయకుడు నాని, వైస్ చైర్మన్ లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో.. జగనన్న సురక్ష నిర్వహించాలి

సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం టి.అర్జాపురం శివారు కొట్నాబెల్లి, డోలవానిపాలెం గిరిజన గ్రామాలల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె.గోవిందరావు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సింగారపు వలసయ్య డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులకు అందించిన వివరాలు మేరకు... టి.అర్జాపురం శివారు కొట్నాబిల్లి, డోలావానిపాలెం గ్రామాలలో సుమారు 120 కుటుంబాలలో 400 మంది కొండ తెగకు చెందిన గిరిజన జనాభా ఉన్నారన్నారు. వీరికి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి మ్యుటేషన్ ద్వారా 20 మందికి పట్టాలను మార్పు చేయాలని కోరారు. భర్తలు చనిపోయి నేటికీ పది సంవత్సరాల కావస్తున్నా పట్టాదార్ పాస్ పుస్తకాలు మార్పు జరగలేదన్నారు. సాగులో చనిపోయిన కుటుంబాల వారసులు ఉన్నప్పటికి పట్టాలు మార్పు జరగలేదని వాపోయారు. అనేకసార్లు రెవెన్యూ అధికారులకి పట్టాలు మార్పులు చేయాలని దరఖాస్తులు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో రైతు భరోసా, ప్రధానమంత్రి కిసాన్ వంటి పథకాలు అందలేదన్నారు. పాస్ పుస్తకాలతో పాటు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 18 మంది, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ కోసం 13 మంది ఉన్నారని తెలిపారు.



చేపడుతున్న మరమ్మతు పనులు

చురుగ్గా రెవెన్యూ కార్యాలయ మరమ్మతు పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండల రెవెన్యూ కార్యాలయ మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెవెన్యూ కార్యాలయం పాతవి కావడంతో మరమ్మతులు గుర్రై సిబ్బంది అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. స్లాబ్ అంత పెచ్చులూడిపోవడంతో వర్షాలు కురిసినప్పుడు స్లాబ్ నుంచి నీరు కారుతుండేది. రికార్డు రూమ్‌లో ఉన్న రికార్డులన్నీ పాడయ్యేవి. దీనిపై స్థానిక ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావు ఉన్నతాధికారులకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పలుమార్లు తెలియజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధి నుంచి నాలుగు లక్షల రూపాయలను మరమ్మతు పనులకు మంజూరు చేశారు. ఆ నిధులతో మరమ్మత్తు పనులను చురుగ్గా సాగుతున్నాయి. నెల రోజుల్లో మరమ్మత్తు పనులన్నీ పూర్తి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ప్రస్తుతం ఎంపిపి స్కూల్‌లో ఉన్న ఒక భవనంలో తహశీల్దార్ కార్యాలయం నిర్వహలణ కొనసాగుతుంది.

సమస్యలపై మధ్యాహ్న కార్మికుల వినతి

ప్రజాశక్తి -చీడికాడ: మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సిఐటియు నేత ఆర్.దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తూ సేవలందిస్తున్నారని తెలిపారు. ఇచ్చే తక్కువ వేతనాలు కూడా సకాలంలో చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మండల మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మండల విద్యాశాఖ అధికారికి వినత పత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు